క్లుప్తంగా

స్వయం ఉపాధి పథకాలకు ఇంటర్వ్యూలు నేడు

గోపాలపట్నం: పలు కార్పొరేషన్ల స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతకు మంగళవారం గోపాలపట్నం పిన్నమ నేని బాంకెట్ హాల్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని జోనల్ కమిషనర్ హేమావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ 89, 90, 91, 92 వార్డుల పరిధిలో బీసీ,కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్న పత్రాలు, ఆధార్, కార్డురేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ పన్ను పత్రం తీసుకు రావాలని పేర్కొన్నారు. వాహనం గురించి దరఖాస్తు చేసుకున్నవారు డ్రైవింగ్ లైసెన్స్ జిరాక్సులు తీసుకు రావాలని సూచించారు.

కోలాట గురువుకు సత్కారం



కోలాట గురువును సత్కరిస్తున్న మహిళలు

మల్కాపురం: మహిళలకు కోలాటంలో శిక్షణ ఇస్తున్న వెంకన్నపాలెం ప్రాంతానికి చెందిన నీలాతి గుణవతి యాదవ్‌ను సోమవారం ఇంటక్ నాయకుడు భోగవిల్లి నాగభూషణం ఆధ్వర్యంలో సత్కరించారు.సంస్కృతి, సాంప్రదాయాన్ని పరిరక్షించే కోలాట కళను పది మందికి పంచడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మహిళలు గుణవతికి శాలువాలు కప్పి,పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన కల్పిస్తున్న బెహరా నర్సింగ్ కళాశాల

గోపాలపట్నం: బెహరా నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. జీవీఎంసీ 88వ వార్డు నరవ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నవజాత శిశువుల ఆరోగ్యం గురించి స్థానికులకు వివరించారు. నర్సింగ్ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ హిందుమతి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బిడ్డ పుటిన తర్వాత 6 నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. నరవ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ప్లస్-2 విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్లస్-2 రెండో సంవత్సరం విద్యార్థులకు సోమవారం పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్యే గణబాబు పంపిణీ చేశారు. బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద రావు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మడి రమణ తదితరులు పాల్గొన్నారు.


సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ బదిలీ



అత్తార్ మహ్మద్ హనీఫ్

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ సీనియర్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్ భిలాయ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దులస్త్రిలోని డీహెచ్ఈపీ కమాండెంట్ జితేంద్రబాబు దువ్వాడ యూనిట్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా రెండేళ్ల కిందట అత్తార్ మహ్మద్ హనీఫ్‌యూనిట్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కిందట ఆయనకు సీనియర్ కమాండెంట్ పదోన్నతి లభించింది. యూనిట్ హెడ్‌గా ఆయన ప్లాంట్ సెక్యూరిటీ కోసం అనేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా అంకితభావంతో పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించారు. సిబ్బంది సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారు.

హార్ట్ టచింగ్



విద్యార్థులు వేసిన వాటర్ కలర్స్ ఆర్ట్

పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు



మదిని దోచేలా.. కోల్ ఆర్ట్

అద్భుత కళాఖండాలు.. రంగులద్దిన బంగారు చేతులు



ఆకట్టుకుంటున్న ఆయిల్ పెయింట్

డ్రాయింగ్‌లో గోపాలపట్నం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ఆకట్టుకుంటున్న పల్లె వాతావరణం

అవి అద్భుతాలకు రంగులద్దిన బంగారు చేతులు.. హృదయాన్ని ఆకట్టుకునే వెన్నెల కాంతులు. సందేశం ఇచ్చే చిత్రాలు.. ఆలోచింప జేసే కళాఖండాలు ఔరా అనిపిస్తున్నాయి. అలా పాఠశాల కీర్తిని దశ దిశలా చాటిచెబుతున్నారుగోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు. కళా ప్రియుల మన్ననలు, సత్కారాలు పొందుతున్నారు.

\- గోపాలపట్నం



విద్యార్థుల చేతుల నుంచి రూపుదిద్దుకున్న హంసలు



నీటిచుక్కని ఒడిసి పడదాం.. పొదుపుగా వాడదాం సందేశం ఇస్తున్న చిత్రం

జాతీయ స్థాయిలో అమీర్ ఆర్ట్ అకాడమీ సంస్థ గతేడాది నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో నలుగురు పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. జిల్లా స్థాయిలో చిత్ర కళాపరిషత్, వివేకానంద సంస్థ, గ్రీన్ క్లైమేట్ సంస్థలు నిర్వహించిన పోటీల్లో తమ ప్రతిభను కనబరిచారు.

సృజనాత్మకతకు మెరుగులు

విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతకు మెరుగులు దిద్దుతున్నారు. కళాత్మకంగా వారి ఆలోచనలకు అందమైన రంగులు అద్దుతున్నారు. అందుకు సహకరిస్తున్నారు పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సీహెచ్ మోహనరావు. విద్యార్థుల్లో డ్రాయింగ్‌పై ఆసక్తిని గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. దీనికి తల్లి దండ్రుల సహకారం తోడవడంతో స్థాయిలో సత్తాచాటుతున్నారు. పెన్సిల్ ఆర్ట్, వాటర్ కలర్స్, ఆయిల్ పెయింట్, కోల్ ఆర్ట్ వంటి పలు ప్రక్రియల్లో తర్ఫీదు ఇస్తున్నారు. అంతే కాకుండా క్రాఫ్ట్‌పై ఆసక్తి ఉన్నవారిని కూడా ప్రోత్సహిస్తున్నారు.



సత్కారం అందుకున్న డ్రాయింగ్ మాస్టారు మోహనరావు

ఫైన్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ చేస్తా



ఫైన్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ పట్టా సాధిస్తాను. డ్రాయింగ్‌లో మంచి భవిష్యత్తు ఉందని నమ్ముతున్నాను. చదువుతో పాటు చిత్రకళలో కూడా ప్రతిభ కనబరుస్తాను. ఉన్నత స్థాయికి ఎదుగుతాను. మా మాస్టారు మాకు అన్ని రకాల డ్రాయింగ్ ప్రక్రియలు నేర్పుతున్నారు. అందుకే జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాం.

\-జి. లక్ష్మి,9వ తరగతి జెడ్పీ జీహెచ్ఎస్

సంతోషంగా ఉంది



డ్రాయింగ్ నేర్చుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. మనసులో అనుకున్న రూపం కళ్ల ముందు కనిపిస్తుంటే పట్టలేనంత ఆనందంగా ఉంటుంది. మా మాస్టారు నాకు ఆ సంతోషాన్ని అందించారు. మంచి మంచి బొమ్మలు వేయగలిగేలా ప్రోత్సహించారు.

\- కె. శార్వాణి, 7వ తరగతి

నాలో ఆర్టిస్ట్‌ను గుర్తించారు



తరగతిగదిలో పాఠాలు చెబుతూ మాలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దారు. పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించే స్థాయికి తీసుకు వచ్చారు. డ్రాయింగ్ మాస్టార్‌కు కృతజ్ఞతలు.భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని సత్తాచూపుతాం.

\-టి. తేజశ్విని, 7వ తరగతి

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు



పలువురు విద్యార్థులు డ్రాయింగ్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు. అంతే కాకుండా ఉన్నత స్థాయిలో ఉన్న పలువురు కళాకారులను తీసుకు వచ్చి విద్యార్థులకు డ్రాయింగ్ వల్ల కలిగే లాభాల గురించి వివరిస్తున్నాను. త్వరలో మా పాఠశాల విద్యార్థులు వేసిన పలు డ్రాయింగ్‌లతో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నాను.

\-సీహెచ్ మోహనరావు, డ్రాయింగ్ మాస్టారు

వాచ్‌మన్‌పై యువకుల దాడి

గోపాలపట్నం: ఇద్దరి యువకుల దాడిలో వాచ్‌మన్ తీవ్రంగా గాయపడిన ఘటన బుచ్చిరాజుపాలెంలో చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుచ్చిరాజుపాలెం గాయత్రి కళాశాలలో వాచ్‌మన్‌గా ఇసరపు అప్పలరాజు(అలియాస్ రాజు) పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి 2 గంటల సమయంలో కళాశాల ఎదురుగా ఉన్న రజకుల కాలనీకి చెందిన యువకులు ఇక్కడి గోడపై మద్యం సేవించడంపై అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో మద్యం మత్తులో యువకులు అప్పలరాజును విచక్షణారహితంగా కొట్టారు. ముఖం, పక్కటెముకులపై దాడి చేశారు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. మృతి చెంది ఉంటాడని భావించిన దాడి చేసిన యువకులు ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. కళాశాల సెల్లార్‌లో పడి ఉన్న రాజును గమనించిన ఇన్‌చార్జి సీతారామయ్య 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అప్పలరాజు తమ్ముడు ఇసరపు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





కేజీహెచ్‌లో చికిత్స పొందతున్న రాజు ()రాజు (ఫైల్)

సమస్యలు పరిష్కరించాలని ఉక్కు కార్మికుల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ప్లాంట్‌లోని అన్ని విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఇప్పటికే సిబ్బంది తక్కువగా ఉండటంతో పని భారం పెరుగుతుందన్నారు. వెంటనే కొత్త నియామకాలు చేపట్టాలన్నారు. ఉద్యోగులకు వేతన సవరణ చేయడంతో పాటు ఇప్పటికే నిలిపివేసిన హెచ్‌ఆర్‌ఏను పునరుద్ధరించాలని, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో నాయకులు పి.వి. రమణమూర్తి, బి.ఎస్. రాజు, ఎస్.ఎ. నాయుడు, మద్ది అప్పలరాజురెడ్డి, మింది దేవుడు, ప్రభాకరరెడ్డి, వెంకన్న, కొమ్ము ప్రసాద్, గోపాలరాజు, పి.వి. నగేష్, పోతారెడ్డి, మొల్లి ఈశ్వరరావు, సుబ్బారావు, దుర్గాప్రసాద్, మధు, ఎం. ప్రసాద్, లోకేష్, ఎస్.ఎస్. రెడ్డి, గోవింద్, హరనాథ్, రమేష్, దిండి మోహన్ పాల్గొన్నారు.



స్టీల్ మెల్ట్ షాప్ విభాగాధిపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మోదీ పాలనలో దేశం కుదేలు

పెదగంట్యాడ: ప్రధానిగా నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత దేశం అన్ని రంగాల్లో కుదేలైందని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ విమర్శించారు. మండలంలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో సోమవారం వివిధ పోరాటాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయని, డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు భారీగా పెంచారన్నారు. వీటిపై గత నెల 23 నుంచి ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి వరకూ తమ పార్టీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జి.ఆనంద్, అచ్యుతరావు, దుర్గారావు, విష్ణుమూర్తి, పోతయ్య, వనజాక్షి, పద్మ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు

11 నుంచి పెంటమాంబ వార్షికోత్సవాలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్ గ్రామదేవత పెంటమాంబ 43వ వార్షికోత్సవాలను ఈ నెల 11 నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావుయాదవ్ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంత యాదవ సంఘ ప్రతినిధి పుర్రె సురేష్‌యాదవ్ తదితరులు ఆవిష్కరించారు.11న అమ్మవారి పండగ చాటింపుఉంటుందన్నారు.15న చింతాలమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, 16,17 తేదీల్లో పెంటమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు,అర్చనలు చేయనున్నట్టు వెల్లడించారు. 18న మజ్జి గౌరమ్మకు ప్రత్యే, 19న పెంటమాంబ అమ్మవారి ప్రధాన పండగ ఉంటుందని తెలిపారు. ఆ రోజు అమ్మవారి ఊరేగింపు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు,భారీ అన్నదానం వంటి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

గోపాలపట్నం : ప్రియుడు అనారోగ్యంతో మృతి చెందాడని మనస్తాపంతో యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చంద్రనగర్‌లో చోటుచేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన గేదెల సుజాత (27) తమ్ముడు కాటంరాజుతో కలిసి చంద్రనగర్‌లో ఉంటుంది. కాగా సుజాత ఆరిలోవకు చెందిన ప్రశాంత్ కుమార్‌తో ప్రేమ వ్యవహారం సాగిస్తోంది. చెడువ్యసనాలకు బానిసైన ప్రశాంత్‌కుమార్ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో మనస్తాపానికి గురైన సుజాత సామవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంటి పై అంతస్తులో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

తమ్ముడు కాటంరాజు భోజనం కోసం పిలిచేందుకు వెళ్లేసరికి తలుపులు వేసి ఉన్నాయి. ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో పగలగొట్టి చూసేసరికి సుజాత ఉరివేసుకుని కనిపించింది. అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారమందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తమ్ముడు కాటంరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పలనాయుడు దర్యాప్తు చేపట్టారు.

లా విద్యార్థులకు నైపుణ్యం అవసరం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలో సోమవారం న్యాయవాదులకు నైపుణ్యాలు, వృత్తి పరమైన మార్గాలపై సదస్సు ఏర్పాటు చేశారు. న్యాయవాద కోర్సు అభ్యసించిన విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి విశాఖపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్, న్యాయవాద వృత్తి, న్యాయవాదులకు అవసరమైన నైపుణ్యాల గురించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం, ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పట్టాలపై సమగ్ర విచారణ చేయాలి

- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

మహారాణిపేట: పారిశ్రామిక ప్రాంతం ములగాడ మండల పరిధి ఎదురువానిపాలెం గ్రామంలో సర్వే నెం.17/1,17/3లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పక్కా ప్రణాళికతో ఆక్రమించే ప్రయత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి ఎదురు సన్యాసిరావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పేదలకు ఇచ్చే పట్టాలను అక్రమ మార్గంలో ఉద్యోగులకు ఎలా మంజూరు చేశారో నిగ్గుతేల్చాలని కోరారు. ప్రభుత్వ పట్టాలు పొంది గాజువాక డిపో ప్రధాన రహదారిని అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాల్లో బహుళ అంతస్తుల వాణిజ్య భవనాలు నిర్మించి వాటి ద్వారా లక్షలాది రూపాయలు అద్దెల రూపంలో లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. అదీ సరిపోక ఎదురువానిపాలెంలో కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని వారి భార్యల పేరు మీద అడ్డదారిలో పట్టాలు పొందారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఆ ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు నిర్మించారని వాటిని తక్షణమే తొలగించి ప్రభుత్వ స్థలంలో గ్రామానికి కల్యాణ మండపం నిర్మించాలని కోరారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక కమిటీ ద్వారా విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించినా దర్యాప్తు నత్తనడకన కొనసాగుతుందన్నారు. రాజకీయ హస్తం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.కలెక్టర్ నేరుగా రంగంలోకి దిగి ప్రభుత్వ భూములను దొడ్డిదారిలో పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తెలుగు మహాసభల లోగో ఆవిష్కరణ

విశాఖ స్పోర్ట్స్: 3వ ప్రపంచ తెలుగు మహాసభల లోగోను శాసనసభ స్పీకర్ చింతకాయల అయన్నపాత్రుడు సోమవారం ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, యాస భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మాతృభాషలో మాట్లాడాలన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రమేవ జయతే అంటూ నినదిస్తున్నామన్నారు. ఆంధ్రలో ఇప్పటికే రెండు సభలు నిర్వహించామన్నారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న పి.రామచంద్రరాజు మాట్లాడుతూ 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో అమరావతి గుంటూరు హైవే శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ గ్రౌండ్స్‌లో జరిగే ఈ సభ జరుగుతుందన్నారు. భాషాభిమానులే అన్ని బాధ్యతలు తీసుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రులతో సహా పలువురు గౌరవనీయుల్ని ఆహ్వానిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై.రామారావు మాట్లాడుతూ గతేడాది 20 బ్లడ్‌బాంక్‌ల ద్వారా లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి అందచేశామన్నారు. ఆరు బ్లడ్‌బాంక్‌ల ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగానే రక్తం అందించామన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడంటూ ప్రచార రెడ్‌క్రాస్ సొసైటీ గోడపత్రికను స్పీకర్ అయ్యన్నపాత్రుడు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ యువ వలంటీర్లు పాల్గొన్నారు.



తెలుగు మహా సభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఆచార్య సరస్వతికి అభినందన

విశాఖ విద్య: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పర్వదినాన ప్రతిష్టాత్మకంగా అందించిన కళా రత్న (హంస) పురస్కారానికి ఏయూ సంగీత విభాగం ఆచార్యులు కె.సరస్వతి విద్యార్థి ఎంపికయ్యారు. ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులు అవార్డు గ్రహీత సరస్వతిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కళాశాల రోజులు.. విద్యార్థుల భవితకు పునాదులు



ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: కళాశాల రోజుల్లో విద్యార్థులు తమ పూర్తి సమయాన్ని వారి అభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు వినియోగించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ్ సూచించారు. సోమవారం నిర్వహించిన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం 69వ విభాగ దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. యువత భవిష్యత్తుకు ఇంజినీరింగ్ కోర్స్ చదివే సమయంలో బలమైన పునాదులు వేసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. గూగుల్ క్లౌడ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ ఉప్పలపాటి మాట్లాడుతూ వ్యక్తి జీవితాన్ని మూడు అంశాలు ప్రభావితం చేస్తాయని చెప్పారు. మనిషి మేధస్సుకు కష్టించేతత్వం జోడిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు సాధించాలని ఆకాంక్షించారు. తమ మేధస్సు, జ్ఞానాన్ని నూతన ఆవిష్కరణల కోసం వినియోగించాలని సూచించారు. సీఎండీ పృథ్వీతేజ్‌ను వీసీ రాజశేఖర్ సత్కరించి జ్ఞాపిక బహూకరించారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

మల్కాపురం: ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని యువత ఆచరించాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆరోగ్యవంతమైన సమాజంతోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తగినంత శారీరక వ్యాయామం చేయాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, ఒత్తిడిని అధిగమించడానికి సామాజిక సేవా కార్యక్రమాలను,లలిత కళలను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాల అధ్యాపకురాలు ఎన్.నదియా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి, ఆదిలక్ష్మి,ధనలక్ష్మి,సలోమి,రాజకుమారి,శిరీష తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

సింధియా: జీవీఎంసీ జీవీఎంసీ 63వ వార్డు పరిధి జయేంద్రకాలనీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా సోమవారం పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, పుక్కల కృష్ణ పాల్గొన్నారు.

ఎంహెచ్ ఆర్‌బీ చైర్‌పర్సన్ పోస్ట్‌కు దరఖాస్తులు

బీచ్‌రోడ్డు: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డ్ చైర్‌పర్సన్(ఎంహెచ్‌ఆర్‌బీ) పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మానసిక వైద్య శాల సూపరింటెండెంట్ కె.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, దరఖాస్తులను https// visakhapatnam.nic.in వెబ్‌సైట్‌లో పొందపరిచామని పేర్కొన్నారు. అర్హత గల వారు ఈ నెల 16వ తేదీలోపు పెదవాల్తేరులోని మానసిక ఆస్పత్రి కార్యాలయంలో సమర్పించాలని కోరారు.